

రేవంత్ నజర్

- పాలమూరు కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం ప్రత్యేక శ్రద్ధ
- ఇప్పటికే మూడు సభలు, రెండు సమావేశాలకు హాజరు
- నేడు వంశీచంద్‌రెడ్డి నామినేషన్‌కు హాజరు కానున్న సీఎం రేవంత్ రెడ్డి
- సొంత ఎన్నికగా తీసుకుని మరీ గెలుపు కోసం వ్యూహాలు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపుపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ పెట్టిన విషయం తెలిసిందే.. రాష్ట్రం నుంచి మెజారిటీ సీట్లు సాధించడం ద్వారా ప్రభుత్వ సుస్థిరతతోపాటు తన మార్క్ రాజకీయాన్ని ప్రదర్శించాలని భావిస్తున్న రేవంత్.. సొంత జిల్లాలో అభ్యర్థుల గెలుపు కోసం ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. ఎప్పటికప్పుడు సర్వే రిపోర్టులు తెప్పించుకుని.. ప్రత్యర్థులు ఎక్కడ బలంగా ఉన్నారో తెలుసుకుని వ్యూహ ప్రతివ్యూహాలు రచిస్తున్నారు. ఈ పార్లమెంట్ పరిధిలో ఉన్న మొత్తం అసెంబ్లీ సెగ్మెంట్లను గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోగా.. గెలుపుపై అధినేత ధీమాతో ఉన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో కూడా వంశీచంద్‌రెడ్డి ఇక్కడి నుంచి ఎంపీగా పోటీచేయగా.. అప్పట్లో రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేదు. కానీ ఈసారి రాష్ట్రంలో అధికారంలో ఉండటంతో ఎలాగైనా ఇక్కడి నుంచి విజయకేతనం ఎగురవేయాలని హస్తం నేతలు ఉవ్విళ్లూరుతున్నారు. ఇందులో భాగంగానే రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో అన్ని స్థానాల కంటే ముందుగానే మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానానికి చల్లా వంశీచంద్‌రెడ్డిని అభ్యర్థిగా ఖరారు చేశారు. అభ్యర్థిగా ప్రకటనకు ముందే వంశీచంద్‌రెడ్డి పాలమూరు న్యాయయాత్ర పేరుతో పార్లమెంట్ నియోజకవర్గవ్యాప్తంగా పాదయాత్ర చేపట్టారు. దీంతోపాటు మీ మాట- మా మేనిఫెస్టో లాంటి పలు వినూత్న కార్యక్రమాలతో ముందుకెళ్తున్నారు. ప్రతీరోజూ రేవంత్‌రెడ్డి సలహాలు, సూచనలతో ఎన్నికల వ్యూహాలు చేసుకుంటున్నారు. గత ఎన్నికల ఓటమి సింపతిగా మారడంతోపాటు.. అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలే ఉండటం తమకు కలిసి వస్తుందని నేతలు భావిస్తున్నారు. దీంతోపాటు ఆపరేషన్ ఆకర్ష్ ద్వారా కీలక నేతలను పార్టీలో చేర్చుకుంటున్నారు. ఇప్పటికే మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి పార్టీలో చేరి.. ఆపరేషన్ ఆకర్ష్‌కు నేతృత్వం వహిస్తుండగా.. మక్తల్ అసెంబ్లీ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా పోటీచేసిన జలంధర్‌రెడ్డి కూడా ఇటీవల కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. చేరికలు కలిసి వస్తాయని నేతలు భావిస్తున్నారు.

ఆరోసారి జిల్లాకు రేవంత్...

సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత రేవంత్ రెడ్డి ఆరోసారి జిల్లా పర్యటనకు రానున్నారు. డిసెంబరు ఏడు ఆయన సీఎంగా ప్రమాణస్వీకారం చేయగా.. ఫిబ్రవరి 22న తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో అభివృద్ధి పనుల శంకుస్థాపనకు రేవంత్ హాజరయ్యారు. ఈ సందర్భంలోనే మహబూబ్‌నగర్ అభ్యర్థిగా సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి పేరును ఖరారు చేశారు. తన నియోజకవర్గంలో తన కంటే అత్యధికంగా మెజారిటీ ఇవ్వాలని, కొడంగల్‌లో 50వేల మెజారిటీ కాంగ్రెస్ అభ్యర్థికి రావాలని పిలుపునిచ్చారు. ఆ తర్వాత మార్చి ఆరున మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో నిర్వహించిన పాలమూరు ప్రజాదీవెన సభకు సీఎం హాజరయ్యారు. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ సందర్భంగా కొడంగల్‌కు వచ్చిన రేవంత్‌రెడ్డి.. స్థానిక ప్రజలతో సమావేశమయ్యారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న రేవంత్‌రెడ్డి, వంశీచంద్‌రెడ్డి(ఫైల్)

మరోసారి కొడంగల్‌లోనే కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా.. దానికి సీఎం హాజరై.. కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఏప్రిల్ 15న నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన జన జాతర సభకు హాజరయ్యారు. తాజాగా పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కాగా.. మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి తరపున నామినేషన్ వేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. కేవలం రెండు నెలల వ్యవధిలోనే ఆరుసార్లు సీఎం ఈ పార్లమెంట్ పరిధిలో పర్యటించడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో జోష్ కనిపిస్తోంది.

నేడు నామినేషన్‌కు హాజరు..

మహబూబ్‌నగర్ అభ్యర్థి నామినేషన్‌కు సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం హాజరుకానున్నారు. తన రాక ద్వారా కార్యకర్తల్లో జోష్ పెంచడంతోపాటు ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేయనున్నారు. ఉదయం 10 గంటలకు రోడ్డు మార్గం ద్వారా జడ్చర్లకు చేరుకోనున్న సీఎం.. అక్కడి నుంచి మహబూబ్‌నగర్ పట్టణంలోని మెట్టుగడ్డ వరకు తన కాన్వాయ్‌లో వస్తారు. అక్కడి నుంచి అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని తీసుకుని. ర్యాలీగా కలెక్టరేట్‌కు బయల్దేరతారు. కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేసిన తర్వాత.. అక్కడి నుంచి ర్యాలీగా క్లాక్‌టవర్‌కు చేరుకుంటారు. అక్కడ నిర్వహించే కార్నర్ మీటింగ్‌లో రేవంత్ ప్రసంగించి.. తిరుగు ప్రయాణం అవుతారు. ఇదే కాకుండా ఎన్నికల్లోపు మరో సభ కూడా సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

తొలిరోజు రెండు నామినేషన్లు

- ముహూర్త బలం ప్రకారం చెరొక సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేసిన మల్లురవి, భరత్‌ప్రసాద్



నామినేషన్ పత్రాలను అందజేస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవి

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి మొదటి ఘట్టం గురువారం ప్రారంభమైంది. ఉదయం 11గంటలకు నోటిఫికేషన్ ప్రక్రియ జారీ కాగానే నామినేషన్లు దాఖలు చేసే అంశానికి తెరదీసింది. తొలిరోజు రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. కాంగ్రెస్ నుంచి డాక్టర్ మల్లురవి మధ్యాహ్నం 1:30గంటలకు తన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి పి.ఉదయ్‌కుమార్‌కు అందజేశారు. ఆయన వెంట అచ్చంపేట, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ, కూచకుళ్ల రాజేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా మల్లురవి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఈ నెల 23న మరో సెట్ నామినేషన్ పత్రాన్ని దాఖలు చేస్తానని ఆ రోజు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా హాజరవుతారని తెలిపారు. అంతకంటే ముందు మధ్యాహ్నం 12:20గంటలకు బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ కూడా తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి పి.ఉదయ్‌కుమార్‌కు అందజేశారు. ఉమామహేశ్వరంలో ప్రత్యేక పూజల అనంతరం తన తండ్రి ప్రస్తుత పార్లమెంట్ సభ్యుడు పోతుగంటి రాములు, ఎమ్మెల్యే రమణారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు జక్కారఘునందన్‌రెడ్డిలతో కలిసి కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయన ఒక సెట్ నామినేషన్‌ను అందజేశారు. కాగా, పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మొదటి రోజు కవరేజీ కోసం వెళ్లిన జర్నలిస్టులకు ఇబ్బంది ఎదురైంది. నామినేషన్ కేంద్రం వద్ద జర్నలిస్టుల కోసం మీడియా పాయింట్ ఏర్పాటు చేయకపోవడం తో జర్నలిస్టులు గంటల తరబడి ఎండలో నిల్చొని తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



రిటర్నింగ్ అధికారి పి.ఉదయ్‌కుమార్‌కు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్

మరికల్, ధన్వాడ మండలాలను దత్తత తీసుకుంటా

-కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి



ధన్వాడలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్ రెడ్డి

ధన్వాడ, ఏప్రిల్ 18 : ఈ ఎన్నికల్లో తనను ఎంపీగా గెలిపిస్తే ధన్వాడ, మరికల్ మండలాలను దత్త తీసుకుంటానని కాంగ్రెస్ పార్టీ పాలమూరు ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. గురువారం ధన్వాడలో ఓ ఫంక్షన్‌హాల్‌లో మరికల్, ధన్వాడ మండలాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధన్వాడ ఉమ్మడి మండలం నుంచి పర్ణికారెడ్డికి వచ్చిన మెజార్టీకన్న తనకు ఒక్క ఓటు ఎక్కువ వచ్చిన ఈ మండలాలకు కావాల్సిన నిధులు తీసుకువస్తానన్నారు. మరికల్‌కు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ధన్వాడలో డిగ్రీ కళాశాల నూతన భవనానికి నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సైతం నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గాలు తనకు రెండు కళ్ల లాంటివని చెప్పారని తెలిపారు. గత పాలకులు ఈ ప్రాంతం గురించి ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డిలను శాలువలతో ఘనంగా సన్మానించారు. అనంతరం మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గాజుల శివకుమార్, ధన్వాడ, మరికల్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరహరి, వీరన్న, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ప్రసన్న రెడ్డి తదితరులు ఉన్నారు.

నామినేషన్ పత్రాలతో పూజలు

మహబూబ్‌నగర్ : కాంగ్రెస్ పార్టీ పాలమూరు ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి శుక్రవారం నామినేషన్ వేయనున్నారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలోని లక్ష్మీనర్సింహ్మ స్వామి ఆలయంలో వంశీచంద్‌రెడ్డి తన భార్య అశ్లేషారెడ్డితో కలిసి నామినేషన్ పత్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మీ బిడ్డగా ఈ ప్రాంతానికి సేవ చేసే అవకాశం కల్పించాలనే సంకల్పంతో పోటీ చేస్తున్న తనకు ప్రజల మద్దతు, దీవెనలతో పాటు భగవంతుని ఆశీస్సులు కావాలని కోరారు.



నామినేషన్ పత్రాలతో పూజలు చేస్తున్న వంశీచంద్‌రెడ్డి దంపతులు

దంచి కొట్టిన ఎండలు

- వడదెబ్బతో వృద్ధురాలి మృతి
- వనపర్తి జిల్లా కొత్తకోటలో 44.1 డిగ్రీల ఉష్ణోగ్రత

మహబూబ్‌నగర్/వనపర్తి అర్బన్/ నారాయణపేట/ నాగర్‌కర్నూల్ టౌన్/ గద్వాల/ధరూరు, ఏప్రిల్ 18 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గురువారం ఎండలు దంచి కొట్టాయి. ఉదయం 10 గంటల నుంచి ఎండ తీవ్రత పెరగడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పెరిగిన ఎండ వల్ల వీధి వ్యాపారులు, కూలీలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లినవారు. తమ పనులు ముగించుకొని త్వరగా ఇంటికి వెళ్తున్నారు.

జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండల కేంద్రంలో వడదెబ్బతో ఓ వృద్ధురాలు గురువారం మృతి చెందింది. కావలి వెంకటమ్మ(62) ధరూరు పరిసర ప్రాంతాల్లో పండ్లు అమ్ముకుంటూ జీవనం సాగించేది. బుధవారం మధ్యాహ్నం స్పృహతప్పి కింద పడిపోవడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి వడదెబ్బకు గురైనట్లు నిర్ధారించారు. చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి చెల్లెలు జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ హుసేన్ తెలిపారు. వనపర్తి జిల్లా కొత్తకోటలో 44.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గోపాల్‌పేట 43.4, పాన్‌గల్, చిన్నంబావి 42.7, పెద్దమందడి, అమరచింత 42.0, మదనాపూర్, ఆత్మకూరు 41.9, పెబ్బేరు, శ్రీరంగాపూర్ 41.6, ఘణపూర్ 40.0, వీపనగండ్ల 40.8, వనపర్తి 40.7, రేవల్లి 40.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్‌లో 43.9 డిగ్రీలు నమోదుకాగా, సీసీకుంటలో 43.3 డిగ్రీలు, మిడ్జిల్‌లో 43.1, కోయిల్‌కొండలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జడ్చర్లలో 42.2 డిగ్రీలు, మహబూబ్‌నగర్‌లో 42, భూత్పూర్‌లో 40.3 డిగ్రీలు నమోదైంది. జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాలలో 43.5 డిగ్రీలు, వడ్డేపల్లిలో 43.2, రాజోలి, అలంపూర్‌లలో 43, ఉండవెల్లి, గద్వాలలో 42.6, కేటీదొడ్డి, అయిజలలో 42.1, ధరూర్‌లో 41.9, మానవపాడులో 41.3, మల్దకల్‌లో 41.2, గట్టులో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలో 43.0, నాగర్‌కర్నూల్‌లో 42.0, ఉప్పునుంతలలో 41.9, కోడేరులో 41.6, కొల్లాపూర్‌లో 41.1, పెద్దకొత్తపల్లిలో 40.9, అచ్చంపేటలో 40.7, తాడూరులో 40.4, లింగాలలో 40.1 డిగ్రీలు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నారాయణపేట జిల్లా కృష్ణలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కోస్గి మండలంలో 39 డిగ్రీలు, మక్తల్‌లో 37 డిగ్రీలు నమోదైంది.



వనపర్తి కొత్తబస్టాండ్ వద్ద జనం లేక నిర్మానుష్యంగా మారిన రోడ్డు

ఆటో, బొలెరో ఢీ : వ్యక్తి మృతి

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 18 : ఆటోను బొలెరో ఢీకొట్టిన ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని పెద్దకార్పాముల గ్రామ శివారులో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. పెద్దకొత్తపల్లి మండలం పెద్దకార్పాముల గ్రామానికి చెందిన గువ్వల నర్సయ్య(34) అనే వ్యక్తి తన సొంత ఆటోలో పెద్దకార్పాముల నుంచి పెద్దకొత్తపల్లికి ప్రయాణికులను చేరవేస్తున్నాడు. బొలెరో వాహనం డ్రైవర్ వినోద్ అతివేగంగా నడుపుకుంటూ వచ్చి ఆటోను ఢీకొట్టడంతో గుంతలో పడిపోయింది. దీంతో ఆటో డ్రైవర్ గువ్వల నర్సయ్య తీవ్ర గాయాలకు గురయ్యాడు. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గువ్వల నర్సయ్య మృతి చెందినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. మృతుని భార్య గువ్వల రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



గువ్వల నర్సయ్య (ఫైల్)

కాంగ్రెస్‌లో ముసలం

- మొన్న గద్వాలలో చంద్రశేఖర్‌రెడ్డిపై సొంత పార్టీ నాయకుల దాడి
- నిన్న వనపర్తిలో ఎమ్మెల్యే ఎదుట గణేష్‌గౌడ్ ఆత్మహత్యాయత్నం
- వర్గాలుగా ఏర్పడి బహిరంగ, సోషల్ వార్‌కు దిగుతున్న నాయకులు
- వనపర్తి నియోజకవర్గంలో చిన్నారెడ్డి వర్సెస్ మేఘారెడ్డిగా మార్పు
- బీఆర్ఎస్ నాయకులను చేర్చుకుంటుండటంతో నారాజ్

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పదేళ్లు ప్రతిపక్షంలో ఉన్నారు.. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలే అవుతోంది. అప్పుడే కాంగ్రెస్ పార్టీలో ఆధిపత్యపోరుకు తెరలేచింది. సొంత పార్టీలోనే నేతల మధ్య కుమ్ములాటలు మొదలయ్యాయి. బహిరంగ విమర్శలతోపాటు సోషల్ వార్‌ను వర్గాలు ఏర్పడి మరీ కాంగ్రెస్ కార్యకర్తలు కొనసాగిస్తున్నారు. ఇది ప్రస్తుతం ప్రజల్లో కొంత నిరసక్తతను కలగజేస్తోందని చెప్పవచ్చు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొత్తం 14 స్థానాలు ఉంటే.. ఓటర్లు 12 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులనే ఎమ్మెల్యేలుగా గెలిపించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో మొత్తానికి మొత్తం స్థానాలు కాంగ్రెస్ గెలుచుకోగా.. ఇక్కడ పెద్దగా పార్టీ ఎమ్మెల్యేలు, నాయకుల మధ్య విభేదాలు లేవు. కానీ నాగర్‌కర్నూలు పార్లమెంట్ పరిధిలో మాత్రం విభేదాలు పెరుగుతున్నాయి. ఒకే పార్టీలో ఉన్నా.. ఒకరు నిర్వహించిన కార్యక్రమానికి మరొకరు హాజరు కాకపోవడం ఆ ఇంటి మీద కాకి ఈ ఇంటి మీద వాలదు అన్నట్లుగా పరిస్థితి తయారైంది. మరీ ముఖ్యంగా వనపర్తి నియోజకవర్గంలో ఈ పరిస్థితి అధికంగా ఉంది. గద్వాల నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా కాంగ్రెస్ గెలవకున్నప్పటికీ.. ఆ ఓటమే కొందరి మధ్య విభేదాలకు కారణమైంది. సదరు అభ్యర్థి గెలిస్తే.. వారి వెంట నడిచేవారే.. ఇప్పుడు సొంతంగా తిరుగుతూ పక్కలో బల్లెంగా తయారయ్యారనే వాదన వినిపిస్తోంది. ఇతర పార్టీల నాయకులను చేర్చుకునే విషయంలో, ఆధిపత్యపోరు విషయంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతల మధ్య వైరం నడుస్తోంది. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చి.. పార్టీలు ప్రచార గోదాలోకి దిగిపోతున్న క్రమంలో అంతర్గత కుమ్ములాటలు పార్టీ అభ్యర్థిపై ప్రభావం చూపుతాయనే అభిప్రాయం వస్తోంది.

గద్వాలలో అనిశ్చితి...

గద్వాల నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికలకు కొద్దిరోజుల ముందు జడ్పీ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. సరితకు పార్టీ టిక్కెట్ కేటాయించడంతో చంద్రశేఖర్‌రెడ్డి, ఆయన తమ్ముడు రాజశేఖర్‌రెడ్డి ఎన్నికల్లో సరిత వెంట నడిచారు. అయితే సరిత గెలిస్తే.. ఆమె వెంటే నడిచేవారు కానీ బీఆర్ఎస్ విజయం సాధించడంతో సరితకు, చంద్రశేఖర్‌రెడ్డికి విభేదాలు వచ్చాయి. కొన్నాళ్లుగా బహిరంగ వేదికల మీదనే విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకుంటున్నారు. ఎవరికి వారే తామే కాంగ్రెస్‌కు పెద్దదిక్కులం అని చెప్పుకుంటున్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం అలంపూర్‌లో మొదలవ్వగా.. అక్కడ వేదికపై పార్టీ ప్రొటోకాల్ విషయమై చంద్రశేఖర్‌రెడ్డి.. సరితను ప్రశ్నించారు. ఇదే క్రమంలో బుధవారం మల్దకల్‌లో ప్రచారం జరగ్గా.. అక్కడ కూడా ప్రచార వాహనం ఎక్కే విషయంలో వాగ్వాదం జరిగింది. పెద్దొడ్డి రామకృష్ణ అనే వ్యక్తితో జరిగిన సంభాషణ కాస్త తోపులాట, ముష్టియుద్ధంగా మారింది. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ ఆధిపత్య పోరు కారణంగా పరిస్థితి గందరగోళంగా తయారైంది. రానున్న రోజుల్లో ఇది పార్టీలో మరింత అనిశ్చితికి కారణమవుతుందనే చర్చ నడుస్తోంది. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం కూడా వర్గాల మధ్య విభేదాలపై దృష్టి సారించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వనపర్తిలో తారస్థాయికి..

వనపర్తి నియోజకవర్గంలో ఎన్నికలకు కొద్దినెలల ముందు ప్రస్తుత ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. అప్పటి వరకు టిక్కెట్ రేసులో ఉన్న చిన్నారెడ్డికే కాంగ్రెస్ పార్టీ రెండో విడతలో టిక్కెట్ కేటాయించగా.. మూడో విడత వచ్చే సరికి ఆ టిక్కెట్‌ను మేఘారెడ్డికి పార్టీ కేటాయించింది. ఇక అప్పటి నుంచే ఇరువురి మధ్య విభేదాలు ప్రారంభమయ్యాయని చెప్ప వచ్చు. ఎన్నికల్లో కాంగ్రెస్ విజయ దుందుభి మోగించడంతోపాటు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా.. తాను పోటీలో ఉంటే మంత్రిని అయ్యేవాడినని చిన్నారెడ్డి భావించారు. ఇక అప్పటి నుంచి అంటీముట్టనట్లుగానే వ్యవహరిస్తున్నారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో గెలిచిన అనంతరం విజయోత్సవ ర్యాలీలో మేఘారెడ్డి నవంబరు 30 వరకు తన వెంట ఉన్నవారే కార్యకర్తలని.. వారికే పార్టీ పదవులు, స్థానిక సంస్థల్లో ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. అలాగే కార్యకర్తల ఆమోదం లేకుండా ఇతర పార్టీల వారిని చేర్చుకోబోమని కూడా స్పష్టం చేశారు. అయితే చిన్నారెడ్డి బీజేపీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంతో రచ్చ మొదలైంది.

ఎమ్మెల్యే దృష్టిలో లేకుండా నిర్ణయం తీసుకోవడంతో చిన్నారెడ్డిపై మేఘారెడ్డి వర్గీయులు గుస్సాగా ఉన్నారు. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు రావడం, ఎమ్మెల్యే చేర్చుకోపోతే చిన్నారెడ్డి ద్వారా పార్టీలోకి రావడం, చిన్నారెడ్డి చేర్చుకోకపోతే మేఘారెడ్డి ద్వారా పార్టీలోకి చేరిపోవడంతో వివాదాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఈ క్రమంలో తాడిపర్తి మాజీ సర్పంచ్ గణేష్‌గౌడ్ తమ గ్రామానికి చెందిన లోకారెడ్డిని చేర్చుకోవద్దని గురువారం పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. ఎమ్మెల్యే వర్గీయులు కాంగ్రెస్ నేతలను వేధించిన జానకిరాంరెడ్డిని ఎలా చేర్చుకున్నారని ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయమై సోషల్ మీడియాలో ఎమ్మెల్యే వర్గీయులు రచ్చకు దిగుతున్నారు. చిన్నారెడ్డి గతంలో చెప్పిన మాటలు, ప్రస్తుతం పనులను ఊటంకిస్తూ కామెంట్లు పెడుతున్నారు. ఈ రచ్చ ఇప్పట్లో తగ్గేట్లు లేదు. పైగా వ్యవహారం చిన్నారెడ్డి వర్సెస్ మేఘారెడ్డిగా మారడంతో భవిష్యత్‌లో ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో వేచిచూడాలి.



మల్దకల్‌లో జరిగిన దాడిలో గాయపడ్డ చంద్రశేఖర్‌రెడ్డి(ఫైల్)

వైభవంగా జ్యోతుల మహోత్సవం

- అనంతపురంలో భారీ ఊరేగింపు - హాజరైన జడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి



జ్యోతులను మోస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, ఎంపీపీ ప్రతాప్‌గౌడ్

గద్వాల, ఏప్రిల్ 18 : జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండలంలోని అనంతపురం గ్రామంలో గురువారం తెల్లవారుజామున జ్యోతుల మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొగట వీరక్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఐదేళ్లకోసారి చౌడేశ్వరీదేవి జ్యోతుల మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామంలో అధిక సంఖ్యలో ఉన్న వీరు తమ కులదేవతగా చౌడేశ్వరి మాతను పూజిస్తారు. ఐదేళ్లకోసారి జరిగే ఈ ఉత్సవాలను 2019లో నిర్వహించారు. మళ్లీ ఇప్పుడు నిర్వహిస్తున్నారు. గురువారం తెల్లవారుజామున ప్రారంభమైన జ్యోతుల ఊరేగింపు ఉదయం 10 గంటల వరకు కొనసాగింది. ఊరేగింపులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన కళాకారులు ప్రదర్శించిన విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఊరేగింపు అనంతరం జ్యోతులతో ఆలయానికి చేరుకొని, అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు.

పాల్గొన్న జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే

చౌడేశ్వరీ దేవి జ్యోతుల మహోత్సవంలో పాల్గొనేందుకు జడ్పీ చైర్‌పర్సన్ సరిత తెల్లవారుజాముననే గ్రామానికి చేరుకున్నారు. ఊరేగింపులో పాల్గొని జ్యోతిని మోశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆమెను ఘనంగా సత్కరించారు. ఉదయం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎంపీపీ ప్రతాప్ గౌడ్, సీనియర్ నాయకుడు గడ్డం కృష్ణారెడ్డి కూడా ఉత్సవానికి హాజరై జ్యోతులను ఎత్తుకున్నారు. అలాగే బీజేపీ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి అమ్మవారికి పూజలు చేశారు.



జ్యోతుల ఊరేగింపులో కళాకారుల విన్యాసాలు

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి



బద్రీనాథ్ (ఫైల్)

బిజినేపల్లి, ఏప్రిల్ 18 : తన ముందు బైక్‌పై వెళ్తున్న వాహనదారులు ఇండికేటర్ వేయకుం డా మలుపు తీసుకోవడంతో వేగంగా వస్తున్న బద్రీనాథ్ (24) అనే యువకుడు బైక్ అదుపు తప్పి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని పాలెంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో గురువారం ఉదయం బద్రీనాథ్ మహబూబ్‌నగర్ జిల్లా వీరన్నపేట నుంచి నాగర్‌కర్నూల్‌కు బైక్‌పై వచ్చాడు. బిజినేపల్లి మండలం పాలెంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఉన్న టిఫిన్ సెంటర్‌లో తినేందుకు బిజినేపల్లి మండలం గుడ్లనర్వ గ్రామానికి చెందిన మరో యువకుడు, ఖానాపూర్ గ్రామానికి చెందిన మరో ఇద్దరు యువకులు బైక్‌లను మలుపు తీసుకున్నారు. అదే సమయంలో వేగంగా వస్తున్న బద్రీనాథ్ వారిని గమనించి సడెన్‌గా బ్రేక్‌ను వేయడంతో అదుపుతప్పి కిందపడి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగశేఖర్ రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

మాగనూరు, ఏప్రిల్ 18 : విద్యుదాఘాతంతో ఓ ఎద్దు మృతి చెందింది. ఈ సంఘటన నారాయణపేట జిల్లా మాగనూరు మండలం గురవులింగంపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన రైతు రంగన మోల నూగప్పకు చెందిన ఎద్దు గడ్డి మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. రూ.లక్ష విలువ గల ఎద్దు మృతి చెందడంతో బాధిత రైతు బోరున విలపించాడు.

బీఆర్ఎస్ భూస్థాపితం కావడం ఖాయం

» కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి

నర్వ, ఏప్రిల్ 18 : రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ భూ స్థాపితం కావడం ఖాయమని కాంగ్రెస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. గురువారం నర్వలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చెన్నయ్య సాగర్ అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ మండల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల భవిష్యత్ బాగు పడాలంటే కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ కార్యకర్తల శ్రమతోనే నేను ఎమ్మెల్యేగా గెలిచానని, అదే విధంగా ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని కూడా భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. మరికల్ మండలం కన్మనూర్ నుంచి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో 100 మంది ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, జగదబిరాంరెడ్డి, కేశం నాగరాజ్ గౌడ్, కార్తీక్‌రెడ్డి, నాయకులు జగన్మోహన్‌రెడ్డి, పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్ రెడ్డి, కృష్ణారెడ్డి, మక్తల్ రవి, వివేక్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శరణప్ప, నీరజ్, వెంకటేశ్వర్‌రెడ్డి, అయ్యపురెడ్డి, బీసం రవి పాల్గొన్నారు

పాలమూరు ఖ్యాతిని చాటాలి

» రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి



అనన్యరెడ్డిని సన్మానిస్తున్న జిల్లెల చిన్నారెడ్డి

వనపర్తి టౌన్/మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 18 : సివిల్స్ ఫలితాల్లో ఆలిండియా మూడవ ర్యాంక్ సాధించిన అనన్యరెడ్డి పాలమూరు ఖ్యాతిని దేశం నలుమూలల చాటారని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. ఇటీవల వెల్లడైన యూపీఎస్సీ ఫలితాల్లో ఆలిండియా మూడవ ర్యాంక్ సాధించిన అనన్యరెడ్డిని గురువారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ఘనంగా సన్మానించారు. అడ్డాకుల మండలం పొన్నకల్ గ్రామంలోని ఆమె నివాసానికి వెళ్లిన ఆయన అనన్యరెడ్డిని శాలువాతో సన్మానించి, పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలమూరులో పుట్టిన ఆణిముత్యం అనన్యరెడ్డి అని, మొదటి ప్రయత్నంలోనే సివిల్స్‌లో పాలమూరు సత్తా చాటడం ప్రతీ ఒక్కరికీ గర్వకారణమన్నారు. అదేవిధంగా అనన్య తల్లిదండ్రులు డీనూర్ సురేష్‌రెడ్డి, మంజుల దంపతులను కూడా సన్మానించారు. అదే విధంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్‌లో మహబూబ్‌నగర్ మాజీ మునిసిపల్ చైర్మన్ కేసీ నర్సింములు అనన్యరెడ్డిని సన్మానించారు.

తెలంగాణ ఆటో డ్రైవర్ ఏపీలో పోటీ



కర్నూల్ పార్లమెంట్ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న తెలంగాణ ఆటో డ్రైవర్ తెలుగు బీచుపల్లి

అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 18 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని బొంకూరు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ తెలుగు బీచుపల్లి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. కర్నూలు ఎంపీ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. గురువారం ఆటోలో కర్నూలుకు కలెక్టర్ డాక్టర్ సృజనకు నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ స్థానం నుంచి పోటీ చేయడం రెండవసారని బీచుపల్లి తెలిపారు. ఈయన గతంలో పాత విడిబాగాలతో ఎలక్ట్రిక్ కారు తయారు చేసి వార్తల్లోకి ఎక్కాడు. జగన్ పాలనలో నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని, వృద్ధులు, తల్లులకు తాయిలాలు ఇచ్చి యువకులను మోసం చేస్తున్నాడని, అందుకే నిరుద్యోగుల తరపున పోటీ చేస్తున్నానని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెబ్బేరు, ఏప్రిల్ 18 : వనపర్తి జిల్లా పెబ్బేరు మండల కేంద్రంలోని జాతీయ రహదారి కొత్తకోట వెళ్లే బైపాస్ వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై సాయిప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన బురమోని శేఖర్(38) అత్తగారి ఊరైన ఏటిగడ్డ శాఖాపురం గ్రామానికి బైక్‌పై వచ్చి తిరుగు ప్రయాణంలో బైపాస్ రంగాపురం వెళ్తుండగా కొత్తకోట వెళ్లే బైపాస్ వద్ద గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో శేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం వనపర్తికి తరలించి మృతుడి తండ్రి పాకనాటి రామచంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా మృతుడు వ్యవసాయం చేసేవాడని, అతనికి భార్య, ముగ్గురు చిన్న పిల్లలు ఉన్నారని గ్రామస్థులు తెలిపారు.

అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

బిజినేపల్లి, ఏప్రిల్ 18 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని అభాగ్యురాలైన 20 ఏళ్ల యువతితో అసభ్యంగా ప్రవర్తించిన అదే గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడిపై బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగశేఖర్ రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. మూడు రోజులుగా యువతి ప్రవర్తనలో వచ్చిన మార్పుపై అనుమానం వచ్చిన తల్లిదండ్రులు ప్రశ్నించగా కీచక ఉపాధ్యాయుడు చేసిన దారుణం వెలుగులోకి వచ్చింది. అభం శుభం తెలియని, మానసిక స్థితి సరిగా లేని యువతితో అసభ్యంగా ప్రవర్తించిన 60 ఏళ్ల ఉపాధ్యాయుడికి ఇదేం బుద్ధని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమంగా గండు ఇసుక తవ్వకాలు



నది నుంచి గండు ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

రాజోలి, ఏప్రిల్ 18 : మండల కేంద్రం శివారులోని తుంగభద్ర నదిలో అక్రమంగా గండు ఇసుక తవ్వకాలు కొనసాగుతున్నాయి. గ్రామానికి చెందిన కొందరు గురువారం నదిలో గండు ఇసుక తవ్వి, ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు ట్రాక్టర్లలో రవాణా చేశారు. అనుమతి లేకుండా గండు ఇసుక తవ్వకాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ హరికృష్ణను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, కార్యాలయంలో సిబ్బంది తక్కువగా ఉన్నందున పర్యవేక్షణ చేయలేక పోతున్నామన్నారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశానికి వెళ్లామని తెలిపారు. తవ్వకాలు మళ్లీ జరిగితే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సికిల్‌సెల్‌కు చెక్

» పీఎం జన్‌మన్ పేరుతో రోగ నిర్ధారణ పరీక్షల కార్యక్రమం

» జిల్లాలో 16 చెంచు ఆవాసాలలో 1383 మంది గుర్తింపు

» ప్రారంభమైన స్ర్కీనింగ్ పరీక్షలు

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), ఏప్రిల్ 18 : చెంచుల్లో ప్రధానంగా వచ్చే సికిల్‌సెల్ వ్యాధిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ప్రధానమంత్రి జన్‌జాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ (పీఎంజన్‌మన్) అనే పేరుతో సికిల్‌సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు మహబూబ్‌నగర్ జిల్లాలో 16 చెంచు ఆవాసాలను గుర్తించింది. అందులో నివసించే 1383 మందికి ఈ పరీక్షలు చేయాలని నిర్ణయించింది. ఈ పరీక్షలు నేటి నుంచి ప్రారంభమైన సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం..

● సికిల్‌సెల్ అంటే : శరీరంలో హిమోగ్లోబిన్ శాతం తక్కువై రక్తహీనత ఏర్పడుతుంది. ఫలితంగా ఎముకల్లో శక్తి తగ్గిపోయి పూర్తిగా మెత్తబడి కాళ్లు, కీళ్లనొప్పులు వస్తాయి. దీంతో వారికి బోన్‌మ్యారో చేయాల్సిన పరిస్థితి వస్తుంది. ఆ వ్యాధి బాధితుడి ఆరోగ్య పరిస్థితిని బట్టి రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. ఈ వ్యాధి బతికి ఉండగానే నరకం చూపిస్తుంది. ఈ వ్యాధి చెంచు ప్రజల్లో ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున కేంద్ర ప్రభుత్వం వారికే ఈ పరీక్షలు చేసి వ్యాధిని అరికట్టేందుకు నిర్ణయం తీసుకుంది.

● జిల్లాలో 16 చెంచు ఆవాసాల గుర్తింపు : జిల్లాలోని ఐదు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మొత్తం 16 చెంచు ఆవాసాలను గుర్తించారు. అందులో ఎదిర పీహెచ్‌సీలో ఫతేపూర్ గ్రామం, మహ్మదాబాద్ పీహెచ్‌సీలో చిన్నాయ్‌పల్లి, ధర్మాపూర్, శేక్‌పల్లి, చౌవారిపల్లి, గండీడ్ పరిధిలో పగిడ్యాల్, జక్లపల్లి, నవాబ్‌పేట పరిధిలో కొండాపూర్, కాకర్లపహాడ్, హన్వాడ పరిధిలో గుడిమల్కాపూర్, ఇబ్రహీంబాద్, కొనగట్టుపల్లి, నాయినోనిపల్లి, దాచక్‌పల్లి ఆవాస గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో 464 ఇళ్లు ఉండగా వాటి పరిధిలో మొత్తం 1,383 మంది చెంచులు నివసిస్తున్నారు. మండలాల వారీగా చూస్తే హన్వాడలో 680 మంది, గండీడ్‌లో 197 మంది, మహ్మదాబాద్‌లో 341 మంది, నవాబ్‌పేటలో 75 మంది, మహబూబ్‌నగర్ మండలం ఫతేపూర్‌లో 90 మంది చొప్పున ఉన్నారు. అత్యధికంగా హన్వాడ మండలంలోనే ఎక్కువ మంది చెంచులు ఉన్నారు.

● పరీక్షలు ఇలా : ప్రతీ ఆవాస గ్రామంలో ఇంటింటికీ తిరిగి అప్పుడే పుట్టిన శిశువు నుంచి 40 ఏళ్లలోపు వారందరికీ రక్త నమూనాలు స్వీకరిస్తారు. వారిలో వ్యాధి లేని వాళ్లు ఎంతమంది, వ్యాధి ఉన్నవాళ్లు ఎంతమంది, భవిష్యత్తులో వ్యాధి వచ్చే వారు ఎంతమంది అనే కేటగిరీలుగా చేసి వారి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి, భవిష్యత్తులో వ్యాధి సంక్రమించే వారిని గుర్తించి వారికి మందులు ఉచితంగా అందజేయనున్నారు. ఈ వ్యాధి వంశపారంపర్యంగా వచ్చే అవకాశాలు ఉన్నందున భవిష్యత్తులో ఎవరికి వ్యాధి సంక్రమిస్తుందో తెలిసిపోతుంది. దీంతో ఎవరు ఎవర్ని పెళ్లి చేసుకోవాలి, ఎవర్ని చేసుకోవద్దు, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై కూడా వారికి అవగాహన కల్పించనున్నారు.



మహిళను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

● ప్రారంభమైన పరీక్షలు : చెంచులకు సికిల్‌సెల్ వ్యాధికి సంబంధించి రక్త పరీక్షలు నిర్వహించే కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభమైంది. గుర్తించిన మండలాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ముందుగా ఆభా కార్డులు ఉన్న వారికి పరీక్షలు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. వారికి పూర్తయిన తర్వాత మిగతా వారికి చేస్తున్నారు. ఈ వారం రోజుల్లో పరీక్షలు పూర్తిచేసి వ్యాధిగ్రస్తుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆ తర్వాత పాజిటివ్ వచ్చిన వారికి మందులు ఇవ్వనున్నారు.





బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులకు ఆ పార్టీ అధినేత కేసీఆర్ గురువారం సాయంత్రం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీ.-ఫారాలు అందజేశారు. అందులో భాగంగా మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానానికి (సిటింగ్ ఎంపీ) ఎంపీ అభ్యర్థిగా మన్నె శ్రీనివాస్‌రెడ్డికి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు బీ-ఫారాలు అందజేశారు. బీ-ఫారంతోపాటు కొంత నగదు చెక్కులను అందజేశారు. విజయం సాధించాలని దిశానిర్దేశం చేసి పంపారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, జైపాల్‌యాదవ్, గువ్వల బాలరాజు, మర్రి జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

24న పెళ్లి, అంతలోనే యువకుడి ఆత్మహత్య

» శెట్టి ఆత్మకూర్ గ్రామంలో విషాదం

గద్వాల, ఏప్రిల్ 18 : కొద్ది రోజుల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సిన యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండల పరిధిలోని శెట్టి ఆత్మకూర్ గ్రామంలో గురువారం తెల్లవారుజామున ఈ విషాద సంఘటన జరిగింది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన యువకుడు గుంటిపల్లి నవీన్ (24) మేస్త్రీ పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉం టున్నాడు. ఆయనకు అదే మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతితో ఈ నెల 24న వివాహం చేయాలని తల్లిదండ్రులు అంజిలన్న, లక్ష్మ మ్మ, కుటుంబసభ్యులు నిర్ణయించారు. అందుకోసం అవసరమైన ఏర్పా ట్లు చేయడంతో పాటు, బంధుమిత్రులకు పెళ్లి పత్రికలు కూడా పంచా రు. పెళ్లి పనుల్లో సంతోషంగా పాల్గొంటున్న నవీన్ బుధవారం హైదరాబాద్‌కు వెళ్లి వచ్చాడు. రాత్రి వాళ్ల చిన్నాన్న ఇంట్లో భోజనం చేసి అక్కడే నిద్రపోయాడు. తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లేందుకు బయటకు వచ్చిన యువకుడు, గ్రామ సమీపంలోని పొలంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం అటుగా వెళ్లిన గ్రామస్థులు చూసి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. త్వరలో పెళ్లి పీటలు ఎక్కాల్సిన తమ కుమారుడు ఆత్మహత్యకు పాల్పడటంతో తల్లిదండ్రులు, కుటంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు గ్రామానికి చేరుకొని పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



గుంటిపల్లి నవీన్ (ఫైల్)

యువతి మరణంపై వీడని మిస్టరీ

» సీసీ పుటేజీలో దొరకని ఆచూకీ » మిస్సింగ్ అయిందంటూ అందని ఫిర్యాదు

» మృతదేహానికి పోస్టుమార్టం

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 18 : కేసీఆర్ అర్బన్ ఎకో పార్క్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన యువతి మరణంపై ఇంకా మిస్టరీ వీడ లేదు. గురువారం ఇందుకు సంబంధించిన పురోగతి లేదు. పోలీసులు సీఎం బందోబస్తు పనిలో బిజీగా ఉండటం, పార్క్‌లో సేకరించిన సీసీ పుటేజీలో యువతి ఆనవాళ్లపై స్పష్టత రాకపోవడంతో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని మార్చూరీలోనే భద్రపరిచారు. ఓ పుటేజీలో యువతి ధరించిన డ్రెస్ కలర్‌లోనే ఓ యువతి వెనక నుంచి దృశ్యాలు కనిపిస్తున్నా అది చనిపోయిన అమ్మాయియేనా? కాదా అన్న విషయంలో స్పష్టత లేదు. ఫారెస్ట్‌లో నాలుగుచోట్ల మాత్రమే కెమెరాలున్నా అందులో అమ్మాయి విజువల్స్ ఎక్కడా కనిపించలేదని తెలుస్తోంది. ఇక అమ్మాయి మిస్సింగ్ అయిందన్న ఫిర్యాదు కానీ, చనిపోయిన అమ్మాయికి సంబంధించిన కుటుంబీకులు గానీ ఎవరూ గురువారం పోలీసులను ఆశ్రయించకపోవడంతో కేసు కొలిక్కి రావడం లేదు.

ప్రమాదవశాత్తు దగ్ధమైన కారు

భూత్పూర్, ఏప్రిల్ 18 : ప్రమాదవశాత్తు కారులో మంటలు చెలరేగడంతో రన్నింగ్‌లో ఉన్న కారు కాలి బూడిదైంది. ఈ సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి జిల్లాలోని ఘనపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కిషోర్ విధులు ముగించుకొని ఆసుపత్రి సిబ్బందితో కలిసి తన సొంత కారైన వ్యాగనార్‌లో తిరిగి మహబూబ్‌నగర్‌కు వస్తున్నారు. భూత్పూర్ మండలం మద్దిగట్ల గ్రామ శివారులోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో అప్రమత్తమై కారును పక్కకు ఆపి అందులో ఉన్నవారంతా దిగిపోయారు. ప్రాణాపాయ స్థితి నుంచి బయట పడ్డారు. ఈ విషయంలో భూత్పూర్ ఎస్ఐని వివరణ కోరగా కారులో మంటలు చెలరేగి కాలిపోయిన సంఘటన గురించి మాకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.



మద్దిగట్ల శివారులో కాలిపోయిన కారు

అనుమానాస్పదంగా గుర్తు తెలియని వ్యక్తి మృతి

దేవరకద్ర, ఏప్రిల్ 18 : అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకున్నట్లు ఎస్ఐ నాగన్న తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలో ఉంటూ భిక్షాటన చేసుకొనే 65ఏళ్ల ఓ వ్యక్తి బుధవారం రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు చంపినట్లు భావిస్తున్నట్లు తెలిపారు. దీంతో స్థానికులు సమాచారం అందించడంతో పరిశీలించి మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా గుర్తిస్తే దేవరకద్ర పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

నగదు పట్టివేత

బాలానగర్, ఏప్రిల్ 18 : ఎన్నికల కోడు అమలులో భాగంగా బాలానగర్ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపూర్ జిల్లా గంగిడిపల్లి తండాకు చెందిన సెవలాల్ నాయక్ వద్ద రూ.51 వేలు కనిపించడంతో పోలీసులు స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. పట్టు బడిన డబ్బులకు సరైన ఆధారాలు చూపి తిరిగి పొందవచ్చని ఎస్ఐ తెలిపారు.



పట్టుబడిన నగదుతో ఎస్ఐ తిరుపాజి

ఇంటి ప్రహరీలోకి దూసుకెళ్లిన లారీ

» తప్పిన ప్రమాదం

అమరచింత, ఏప్రిల్ 18 : ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి వడ్ల లోడు లారీ ప్రమాదవశాత్తు ఇంటి కంపౌండ్‌లోకి దూసుకెళ్లిన సంఘటన వనపర్తి జిల్లా అమరచింత మండలం మస్తీపూర్ గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే చింతరెడ్డిపల్లి గ్రామం నుంచి ఆత్మకూరుకు చెందిన ఓ ప్రైవేటు రైస్ మిల్లర్ రైతుల వద్ద వడ్లను కొనుగోలు చేసి లారీలో నింపుకొని ఆత్మకూరు వైపు వస్తుండగా మస్తిపూర్ గ్రామంలో వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి ఇంటి సమీపంలో రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్లకు దారి ఇవ్వబోయి ప్రమాదవశాత్తు వేగంలో ఉన్న లారీ ఏకంగా బిజి రమేష్‌రెడ్డి ఇంటి కంపౌండ్‌లోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. సంబంధిత రైస్ మిల్ యజమాని హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని లారీలో ఉన్న వడ్లను దించే ప్రయత్నం చేస్తున్నారు. క్రేన్ సాయంతో కంపౌండ్‌లోకి దూసుకెళ్లిన లారీని మధ్యరాత్రి వరకు బయటికి తీసే అవకాశం ఉంది. దీంతో గద్వాల, ఆత్మకూరుకు వెళ్లే దారిలో రాకపోకలకు కొంత అంతరాయం కలిగింది.



మస్తీపూర్ గ్రామంలో ఇంటి ప్రహరీలోకి దూసుకెళ్లిన లారీ

ప్రమాదవశాత్తు బావిలో పడి మహిళ మృతి

పాన్‌గల్, ఏప్రిల్ 18 : ప్రమాదవశాత్తు బావిలో పడి మహిళ మృతిచెందిన సంఘటన వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం కేతేపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై వేణు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చంద్రమ్మ(58) కట్టెలు తెచ్చేందుకు వెళ్లి గ్రామంలోని తీటకుంట బావిలో నీళ్లు తాగేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందింది. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించి, కుటుంబీకుల ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి భర్త ఎల్లయ్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

వ్యక్తిపై దాడి, కేసు నమోదు

వెల్దండ, ఏప్రిల్ 18 : మండల పరిధిలోని నగారాగడ్డతండాకు చెందిన లోకిలాల్ అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన కొర్ర బాలు అతని కుమారుడు పవన్‌లు దాడిచేయడంతో గురువారం బాధితుని ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామంలో భూ తగాదా నేపథ్యంలో జరిగిన ఘర్షణలో లోకిలాల్‌పై తండ్రీ కొడుకులు దాడిచేశారు. ఈ మేరకు బాలు, పవన్‌లపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ ఎం. రవి తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 18 : జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం పుల్లూరు శివారులో జాతీయ రహదారి మీదుగా ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీని పట్టుకున్నట్లు ఏఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు. పుల్లూరు టోల్ ప్లాజా వద్ద గురువారం తెల్లవారుజామున తనిఖీలు చేస్తుండగా కర్నూలు నుంచి హైదరాబాదు వైపు ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీని తనిఖీ చేశారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో లారీని స్టేషన్‌కు తరలించి, డ్రైవర్ నరసింహపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఐదు ఇసుక ట్రాక్టర్లు..

ఉప్పునుంతల, ఏప్రిల్ 18 : అనుమతులు లేకుండా దుందుభీ వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను గురువారం పట్టుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై లెనిన్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని జప్తి సదగోడు గ్రామ సమీపంలోని దుందుభీ వాగు ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. మొల్గర గ్రామానికి చెందిన గోవింద్, మహేష్, నడింపల్లి ఆనంద్ కుమార్, ఉల్పర గ్రామానికి చెందిన నిరంజన్, మిట్టసదగోడు గ్రామానికి చెందిన మల్లేష్, ఉల్పర గ్రామానికి చెందిన ఉల్పర శేఖర్, సుమన్‌కు సంబంధించిన ఐదు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. ఏఎస్సై సుజ్ఞానం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ట్రాక్టర్లు పట్టుకొని స్టేషన్‌కు తరలించారు.

కారు, బైకు ఢీ ముగ్గురికి గాయాలు


మిడ్జిల్, ఏప్రిల్ 18 : జడ్చర్ల మండలం గంగాపురం గ్రామ శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. జడ్చర్ల వైపు నుంచి వెళుతున్న కారు, మిడ్జిల్ వైపు నుంచి వస్తున్న బైక్‌ను ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న అమినాబేగం తలకు, గౌస్ ఎడమచేతికి, బైక్‌పై ఉన్న ప్రవీణ్‌కు గాయాలైనట్లు తెలిపారు. ప్రవీణ్ నవాబుపేట మండలం తీగలపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి అని తెలిపారు. గాయపడిన ముగ్గురిని 108 అంబులెన్స్ ఈఎంటి శివారెడ్డి, పైలెట్ మల్లేశ్వర్‌లు జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

నేడు డయల్ యువర్ ఆర్ఎం

మహబూబ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 18 : నేడు (శుక్రవారం) సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ విశ్రీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఆర్టీసీ ప్రయాణికులు తమ సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ప్రయాణికుల సమస్యలు పరిష్కరించేందుకే కాకుండా వారి సూచనలు, సలహాలతో సంస్థను మరింత ప్రగతి పథంలో నడిపించేందుకు ప్రతీ నెల ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. ప్రయాణికులు సలహాలను సెల్ నెం.9959226295 సంప్రదించాలని కోరారు.

బస్సును ఢీకొన్న ఆటో

మిడ్జిల్, ఏప్రిల్ 18 : జడ్చర్ల పట్టణంలో కావేరమ్మపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. జడ్చర్ల కొత్త బస్టాండు నుంచి కల్వకుర్తి వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు కావేరమ్మపేట రెక్వెస్ట్ బస్ స్టాప్ వద్ద ప్యాసింజర్‌ను దింపేందుకు ఆపగా వెనుక నుంచి వస్తున్న ఆటో ఢీకొన్నది. దీంతో ఆ ఆటో డ్రైవర్ కృష్ణయ్య ఆటో హ్యాండిల్, సీటు మధ్యన ఇరుక్కున్నాడు. స్థానికులు ఆటోలో నుంచి బయటికి తీసి 108 అంబులెన్స్ ద్వారా జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ కృష్ణయ్యకు స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు.



ఆటోలో ఇరుక్కున్న కృష్ణయ్య

వంట సామగ్రి చోరీ

కోడేరు, ఏప్రిల్ 18 : నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో వంట సామగ్రి చోరీకి గురైంది. ఈ నెల 16న పాఠశాలలో మధ్యాహ్నం భోజనాలు వడ్డించి కొన్ని సామగ్రి గదిలో, మూడు వంట పాత్రలు వంట చేసే సమీపంలో ఆవరణలో ఎప్పటిలాగే ఉంచారు. 17న సెలవు దినం కావడంతో గురువారం వెళ్లి చూస్తే లేవని వంట మహిళలు తెలిపారు. గతంలో వంట సామగ్రి పోయిందని వారు వాపోయారు.

ఉమామహేశ్వర క్షేత్రంలో భరత్ ప్రత్యేక పూజలు



బీజేపీ ఎంపీ అభ్యర్థిని శాలువాతో సన్మానిస్తున్న ఆలయ అర్చకులు

అచ్చంపేటటౌన్, ఏప్రిల్ 18: ఉమామహేశ్వర క్షేత్రంలో గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ ఈశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ ఈవో శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్ కందూరు సుధాకర్, అర్చకుడు వీరయ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పాపనాశిని గుండంలో పుణ్యస్నానాలు ఆచరించి ఈశ్వరునికి క్షీరాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, గణపతి అయ్యప్పస్వాములకు ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. అర్చకులు వీరయ్య, నీలకంఠం, రాజశేఖర్, రవికుమార్ ఆయనకు ఆలయచరిత్ర వివరించారు.

వడదెబ్బ చికిత్స కోసం ప్రత్యేక వార్డు ఏర్పాటు

- జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కే సుధాకర్‌లాల్



ప్రత్యేక వార్డును పరిశీలిస్తున్న డాక్టర్ కే సుధాకర్‌లాల్

కందనూలు, ఏప్రిల్ 18 : హీట్‌వేవ్ పెరుగుదలపై కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రత్యేక వార్డు ఏర్పాటును జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కే.సుధాకర్‌లాల్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సన్‌స్ట్రోక్‌కు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వేడి గాలులు, ఎండల వల్ల సమస్యలు ఎదురైతే వెంటనే వైద్య నిపుణులను సంప్రదించాలని సూచించారు. వడదెబ్బ లక్షణాలు అనిపిస్తే ప్రజలెవరూ ఆందోళనకు గురి కాకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. అత్యవసరమైతే జిల్లాలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో హీట్‌వేవ్ చికిత్స కోసం 20బెడ్లతో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయడం జరిగిందని సూచించారు. జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సాయినాథ్‌రెడ్డి, ఆసుపత్రి వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

బేకరీలో కల్తీ పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు

బిజినేపల్లి, ఏప్రిల్ 18 : బేకరీలు, హోటల్స్‌లో కల్తీ ఆహార పదార్థాలను విక్రయించిన, నాణ్యత ప్రమాణాలు లేని నిత్యావసర వస్తువులను ప్రజలకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా దుకాణాల లైసెన్సులను రద్దు చేయనున్నట్లు జిల్లా ఆహార భద్రత తనిఖీ అధికారి మనోజ్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని బెంగళూర్ అయ్యంగారి బేకరి, హోటల్స్‌ను గురువారం ఆకస్మిక తనిఖీ చేసి ఆహార పదార్థాలను పరిశీలించి శాంపిల్స్‌ను సేకరించారు. వాటిని ల్యాబ్‌లో పరిశీలనకు పంపించనున్నట్లు తెలిపారు. శాంపిల్స్‌లో కల్తీ జరిగినట్లుగా గుర్తిస్తే సంబంధిత యజమానిపై శాఖపరమైన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు దుకాణాల లైసెన్స్‌ను రద్దు చేయించనున్నట్లు పేర్కొన్నారు. హోటల్స్, బేకరిల్లో విధిగా పరిశుభ్రతను పాటించడంతో పాటు ఆహార వ్యర్థాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని అన్నారు. ఆయన వెంట సిబ్బంది వాజీద్ ఉన్నారు.

డాక్టర్ మల్లు రవి గెలుపే లక్ష్యం కావాలి

- ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి



పోతిరెడ్డిపల్లిలో కార్యకర్తలతో ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

తిమ్మాజిపేట, ఏప్రిల్ 18 : గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు ఒకటిగా ఉండాలని అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని డాక్టర్ మల్లురవి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. తిమ్మాజిపేట మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో కాంగ్రెస్ కార్యకర్త ఆగపు శంకర్ వివాహ వేడుకల్లో పాల్గొని గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఎంపీటీసీ సభ్యుడు తిరుపతయ్య తండ్రిని పరామర్శించి కుటుంబ సభ్యుల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్య గౌడ్ ఇంటి ఆవరణలో కార్యకర్తలతో కాసేపు మాట్లాడారు. ప్రతీ కార్యకర్తం ఏకం కావాలని మంచి మెజార్టీ కోసం పని చేయాలని సూచించారు. గ్రామంలో అందరూ సమానమేనని విభేధాలు విడనాడాలని కార్యకర్తలకు కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ మల్లురవిని గెలిపించడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ బహదూర్, వెంకటరాంరెడ్డి, మాధవులు, ఉస్మాన్‌రవూఫ్, మల్లేష్‌ముదిరాజ్, తిరుపతయ్య, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీని ఓడించండి'



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

అచ్చంపేటటౌన్, ఏప్రిల్ 18: బీజేపీని ఓడించి ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. గురువారం పట్టణంలోని టీఎన్జీవో భవనంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు దేశ్యానాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పార్టీ నాయకులు పర్వతాలు, శ్రీనివాసులు, ఆంజనేయులు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

పెంట్లవెల్లి, ఏప్రిల్ 18 : నరేంద్రమోదీ దేశంలో మూడవసారి అధికారంలోకి రాబోతున్నారని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మూలే భరత్‌చంద్ర గురువారం అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ మండల కార్యదర్శి మూలే వెంకటేశ్, బీజేపీ నాయకులు రవి, శివ, సాయి, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి హుండీ ఆదాయం లెక్కింపు

- ఆదాయం రూ. 1,04,468

ఉప్పునుంతల, ఏప్రిల్ 18: మండల పరిధిలోని మామిళ్లపల్లి లక్ష్మీనరసింహస్వామి హుండీ లెక్కింపు ఆలయ ఈవో శ్రీనివాస రావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఆలయ హుండీ ఆదాయం రూ. లక్షా 4వేల 468 వచ్చినట్లు ఆయన తెలిపారు. గత ఏడాది నుంచి ఏప్రిల్ మాసం వరకు హుండీ ద్వారా ఆలయానికి ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజల్ రావు, కమిటీ సభ్యులు గణేష్, అంజనేయులు, రామస్వామి, ఎర్రయ్య పాల్గొన్నారు.

'జనయాత్రను విజయవంతం చేయాలి'

ఊర్కొండ, ఏప్రిల్ 18 : మహబూబ్‌నగర్‌లో శుక్రవారం నిర్వహించనున్న అభిమాన జనయాత్రను విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్ రెడ్డి అన్నారు.

అభిమాన జనయాత్రకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానున్నారని, అదేవిధంగా మహబూబ్ నగర్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డి నామినేషన్ దరఖాస్తు చేస్తున్నారని, ఈ కార్యక్రమాలకు భారీగా కాంగ్రెస్ శ్రేణులు తరలిరావాలని ఆయన కోరారు.

కొనసాగుతున్న సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు

చారకొండ, ఏప్రిల్ 18: మండలంలోని సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా భక్తులు సీతారామచంద్రస్వామితో పాటు లక్ష్మణుడు, ఆంజనేయస్వామి, మైసమ్మ, పోచమ్మ తల్లులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గురువారం ఆలయ చైర్మన్ ఢేరం రామశర్మ, ఈవో శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు స్వామి వారికి అభిషేకం, అర్చనాదులు, వేదపారాయణం, కుంకుమార్చనలు నిర్వహించారు. రాత్రికి ప్రదోష రాజోపచారములు చిన్నతేరు (పూలతేరు) నిర్వహిస్తున్నట్లు అదేవిధంగా భక్తులకు తాగునీటితో పాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆలయ చైర్మన్ తెలిపారు. దేవాలయం దిగువన మిఠాయిలు, వివిధ రకాల బొమ్మల దుకాణాల్లో భక్తులు కొనుగోలు చేశారు. అదే విధంగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా 20న రాత్రి జరిగే (పెద్దరథం) బ్రహ్మోత్సవానికి సిర్సనగండ్లకు చెంది విశ్వకర్మలు రథచక్రాలు, రథం కర్రలు, ఇర్సులు, నిమ్ములు కొత్తవి తయారు చేస్తున్నారు. (పెద్దరథం) బ్రహ్మోత్సవానికి గుట్ట కింది నుంచి దేవాలయం వరకు ఆర్టీసీ బస్సులో ఉచితంగా సదుపాయం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.

● ఆలయ అభివృద్ధికి సహకరించాలి

సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా గుట్ట దిగువన మిఠాయిలు, వివిధ రకాల బొమ్మలు, తదితర దుకాణాలు ఏర్పాటు చేసుకొన్న వారు దేవాలయ సిబ్బందికి తైబాజారు రుసుము చెల్లించి రశీదులు తీసుకొని ఆలయ అభివృద్ధికి తోడ్పాడాలని దుకాణదారులకు సూచించారు. ఆలయ సిబ్బంది కాకుండా ఎవరైన వచ్చి బలవంతపు వసూలు చేస్తే గుట్టపైకి వచ్చి దేవాలయశాఖకు వారికి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆలయ మేనేజరు నిరంజన్, ఆలయ అర్చకులు ఢేరం మురళీదర్‌శర్మ, ఢేరం లక్ష్మణశర్మ, ఢేరం ప్రవీన్‌శర్మ, ఢేరం అనంతరామశర్మ, ఢేరం గోపికృష్ణశర్మ, ఢేరం వేణుగోపాలశర్మ, ఢేరం రఘుశర్మ, ఢేరం జయప్రకాష్‌శర్మ, భక్తులు తదతరులు పాల్గొన్నారు.



స్వామి వారిని దర్శించుకొని పూజలు చేస్తున్న భక్తులు



భక్తులకు ఉచిత వైద్యం చేస్తున్న వైద్యుడు సీహెచ్ శ్రీనివాసులు

వైద్య శిబిరం

చారకొండ మండల కేంద్రానికి చెందిన గ్రామీణ వైద్యుడు చిలివేరు శ్రీనివాసులు తన తల్లి దండ్రులు చిలివేరు మల్లమ్మ, డాక్టర్ చిలివేరు మల్లప్ప జ్ఞాపకార్థం శ్రీరామనవమిని పురస్కరించుకొని మండలంలోని సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తులకు గురువారం దేవాలయం ఆవరణంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం 20 ఏళ్ల నుంచి సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా వారం రోజుల పాటు వచ్చే భక్తులకు వైద్యం శిబిరం ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపిరు. ఆలయ చైర్మన్ ఢేరం రామశర్మ, ఈవో యెన్న శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ నిరంజన్, ఆలయ అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చెన్నకేశవస్వామి రథోత్సవం

తాడూరు, ఏప్రిల్ 18: మండలంలోని ఇంద్రకల్, పాపగల్, గుట్టలపల్లి గ్రామాల్లో శ్రీరామనవమి పురస్కరించుకుని రథోత్సవాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలతో గ్రామ వీధుల గుండా భాజాభజంత్రీలతో తిరుగుతూ సంకీర్తన కార్యక్రమాలను చేపట్టారు. రథోత్సవానికి ఆయా గ్రామాల పరిధిలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రథోత్సవ కార్యక్రమాన్ని కనులపండుగగా నిర్వహించారు. ఇంద్రకల్ చెన్నకేశవస్వామి ఆలయ ఆవరణలో ప్రత్యేక పూజల అనంతరం భక్తులు రథాలను లాగారు. మండల వ్యాప్తంగా శ్రీరామనవమిని పురస్కరించుకుని భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంద్రకల్ గ్రామ మాజీ సర్పంచ్ వెంకటయ్య, పాపగల్ గ్రామ సర్పంచ్ సువర్ణ, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



ఇంద్రకల్‌లో తేరును లాగుతున్న భక్తులు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

ఉప్పునుంతల : మండల కేంద్రంలోని చెన్నకేశవ కేదారేశ్వర ఆలయంలో, అదేవిధంగా మండల పరిధిలోని కంసానిపల్లి గ్రామంలోని శ్రీరామ గట్టుపై భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా రథోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. రథోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

పెద్ద ఎత్తున భక్తులు రథోత్సవంలో పాల్గొని రథం లాగి తమ మొక్కులు తీర్చుకున్నారు. మండల కేంద్రంలోని కేదారేశ్వర ఆలయం వద్ద మొట్టమొదటిసారిగా నూతన రథోత్సవ కార్యక్రమం కావడంతో పెద్ద ఎత్తున్న భక్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో గురువారం రథోత్సవం అనంతరం బండలాగుడు పోటీలను కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు కట్టా నందారెడ్డి ప్రారంభించారు. ఉత్సవాలలో పాల్గొని మండలంలోని చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఉత్సవాలలో పెద్ద మొత్తంలో నగదు బహుమతి ప్రకటించడంతో ఆయా ప్రాంతాల నుంచి ఎద్దుల పోటీదారులు తమ ఎద్దులను పోటీలో దింపారు. ఎస్సై బందోబస్తు నిర్వహించారు. కట్టా అనంత రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పెద్ద జంగిరెడ్డి, సూరం వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలి

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ, ఏప్రిల్ 18 : స్వచ్ఛంద సంస్థలు, మానవతావాదులు ప్రతీ ఒక్కరు సామాజిక సేవలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి సూచించారు. గురువారం కల్వకుర్తి వెంకటరమణ హాస్పిటల్ ఆధ్వర్యంలో హైదరాబాద్ యశోద ఆస్పత్రి సహకారంతో వెల్దండ రిక్రియేషన్ క్లబ్‌లో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని కశిరెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో వైద్యానికి నోచుకోని వారికి వైద్యశిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. శిబిరంలో 250 మందికి బీపీ, మధుమేహం, ఈసీజీ, టుడీఈకో, బోన్ టెస్ట్, కంటి పరీక్షలు చేసి అవసరమైనవారికి మందులు ఉచితంగా అందజేశారు. శిబిరానికి ముఖ్యమంత్రి సోదరుడు కృష్ణారెడ్డి హాజరై నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, ఆర్యవైశ్యసంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చురామకృష్ణ, క్లబ్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కార్యదర్శి అంజనేయులు, వైద్యులు వీరమళ్ల శరత్, వీరమళ్ల రంజిత్, ధర్మతేజ, సంతోషిణి, నితిన్, మానస, ఉమాదేవి, సీఐ విష్ణువర్దన్‌రెడ్డి, ఎస్ఐ రవి, క్యాంపు ఇన్‌చార్జి నాగరాజు, శ్రీధర్, అవినాష్, నాయకులు సంజీవ్‌కుమార్, రాంచంద్రారెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి(వైఎస్), శిశుపాల్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, పర్వత్‌రెడ్డి, మోతీలాల్ తదితరులు ఉన్నారు.



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కేంద్రంలో మళ్లీ బీజేపీదే అధికారం

- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కల్వకుర్తి, ఏప్రిల్ 18 : కేంద్రంలో మళ్లీ బీజేపీదే అధికారమని మూడవసారి నరేంద్రమోదీ ప్రధాని కావడం ఖాయమని కామారెడ్డి ఎమ్మెల్యే కే వెంకటరమణారెడ్డి తెలిపారు. కల్వకుర్తి పట్టణంలోని పద్మశాలి భవన్‌లో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, ఎంపీ పోతుగంటి రాములు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారిల సమక్షంలో కల్వకుర్తికి చెందిన రాంభూపాల్‌రెడ్డి, పలువురు నాయకులు గురువారం బీజేపీలో చేరారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ దేశంలో ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో సుపరిపాలన కొనసాగుతోందని తెలిపారు. 400 సీట్లలో బీజేపీ ఎంపీ అభ్యర్థులు విజయం సాధించబోతున్నారని ఆయన పేర్కొన్నారు.

భరత్‌ను ఆశీర్వదించండి: ఎంపీ రాములు

బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు కోరారు. దేశంలో నరేంద్రమోదీ నాయకత్వంలోని పాలన ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పని చేయాలని కోరారు. బీజేపీ రా ష్ట్ర కౌన్సిల్ సభ్యులు మొగిలి దుర్గాప్రసాద్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బోడ నరసింహ, గుండూరు ఎంపీటీసీ సభ్యుడు నర్సిరెడ్డి, బీజేపీ నాయకులు శేఖర్‌రెడ్డి, కృష్ణగౌడ్, రాఘవేందర్‌గౌడ్, సురేందర్‌గౌడ్, బాబీదేవ్, రవిగౌడ్, విజయ్, శ్రీధర్, నరేష్‌గౌడ్, చందు, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

మిత్రుడి కూతురి పెళ్లికి రూ.3లక్షల సాయం

- ఘనంగా పెళ్లి నిర్వహించిన స్నేహితులు

కొల్లాపూర్, ఏప్రిల్ 18 : తమతోపాటే చదివిన మిత్రుడి కూతురి పెళ్లికి స్నేహితులు రూ.మూడు లక్షల ఆర్థిక సాయం అందించారు. అనారోగ్యంతో మంచానికి పరిమితమై తల్లిలేని తన కూతురు వివాహానికి సాయం కోరిన వెంటనే తమతోపాటు చదివిన మిత్రులంతా స్పందించి అండగా నిలిచారు.. తమ మిత్రుడి కూతురు పెళ్లికి పెద్దలుగా మారి లాంఛనంగా సంప్రదాయబద్దంగా కొల్లాపూర్ గాంధీ స్మారక ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు పెళ్లి జరిపించారు. ఇది పెబ్బేరు మండలం యాపర్లలో గురువారం చోటుచేసుకున్నది. 1986-87సంవత్సరంలో కొల్లాపూర్ పట్టణంలోని గాంధీ స్మారక ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు అప్పట్లో తమతోపాటు చదివిన తోటి విద్యార్థి కురుమూర్తి అనారోగ్యం కారణంగా దీర్ఘకాలికంగా మంచానికే పరిమితమయ్యాడు. కూతురు పెళ్లి చేయడానికి తనతో పాటు చదివిన మిత్రులను కొంత ఆర్థిక సాయం కోరాడు. దీనికి మిత్రులంతా స్పందించి రూ. 3 ల క్షలకు పైగా సేకరించి తమ మిత్రునికి అందించారు. పెద్ద దిక్కుగా మారి మిత్రులంతా లాంఛనంగా సాంప్రదాయబద్ధంగా పెళ్లి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పెళ్లిలో పెళ్లి కూతురుకు కావాల్సిన అన్ని రకాల వసతు లతో పాటు విలువైన కానుకలను కూడా పెళ్లి కూతురికి సమర్పించి తల్లి లేని లోటును తన తండ్రి, మిత్రులు తీర్చడంతో పెళ్లి కూతురు సంతోషం వ్యక్తం చేసింది.

చిన్ననాటి మిత్రులు తాను సాయం కోరిన వెంటనే స్పందించి తన కూతురి వివాహాన్ని ఘనంగా నిర్వహించడం తన జీవితంలో మరిచిపోలేనని తన మిత్రులు చేసిన పని తనకెంతో సంతృప్తినిచ్చిందని పెళ్లి కూతురు తండ్రి కురుమూర్తి పేర్కొన్నారు. పెళ్లి వేళ పూర్వ మిత్రులంతా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడిపారు. నిజ జీవితంలో కూడా మిత్రునికి కష్టం వస్తే తోటి మిత్రులు ఆదుకుంటారనే రీతిలో కొల్లాపూర్ గాంధీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు చేసిన పెళ్లిని పలువురు అభినందించారు.



మిత్రుడి కూతురిని పెళ్లి కూతురు చేస్తున్న మిత్రులు

నిషేధిత మందులు అమ్మితే చర్యలు

తిమ్మాజిపేట, ఏప్రిల్ 18 : దుకాణంలో నిషేధించబడిన క్రిమిసంహారక మందులు, విత్తనాలు రైతులకు అమ్మితే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్ హెచ్చరించారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలోని మణికంఠ ఆగ్రో రైతు సేవా కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను ఈ పాస్ మిషన్‌ను పరిశీలించి పలు సూచనలు, సలహాలు చేశారు. రైతుకు ఎరువులు అమ్మితే రసీదు ఇవ్వడం తప్పనిసరి అన్నారు.

వేసవి క్రీడా శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఏప్రిల్ 18 : జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించేందుకు అర్హులైన వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకా రులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సుధీర్‌కుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలి పారు. మే ఒకటి నుంచి 31వ తేదీ వరకు వివిధ క్రీడాంశాల్లో గ్రామీణ యువతకు శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. సీనియర్ క్రీడాకారులైతే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ఉండాల న్నారు. దరఖాస్తుతో పాటు సంబంధిత క్రీడల్లో తాము సాధించిన విజయాల ధ్రువపత్రాలు జత చేయాలన్నారు. స్థానికంగా ఉండి క్రీడా శిక్షణ ఇచ్చేవారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. దరఖాస్తులను ఈనెల 25వ తేదీలోపు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి కార్యాలయం రూమ్ నెం.201, ఐడీవోసీ భవనం వనపర్తిలో అందజేయాలన్నారు.

మల్లు రవికి మద్దతుగా కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కందనూలు, ఏప్రిల్ 18 : కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పిలిస్తే పలికే డాక్టర్ మల్లురవి విజయానికి మద్దతుగా టీపీసీసీ డాక్టర్స్ విభాగం ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. మల్లురవి తన నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన అనంతరం పీసీసీ డాక్టర్‌విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మాణిక్యాల చెన్నయ్య మల్లురవి విజయానికి మద్దతుగా తయారు చేసిన కరపత్రాలను కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, వంశీకృష్ణ, కొల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సీఆర్.జగదీశ్వర్‌రావుల చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా డాక్టర్ చెన్నయ్య మాట్లాడుతూ మల్లురవి గెలుపే ధ్యేయంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించి ఓటర్లను కలిసి మల్లురవి విజయానికి దోహదపడు తానని అన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

వెల్దండ, ఏప్రిల్ 18 : ఎరువుల దుకాణాలలో నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి చంద్రశేఖర్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని ఆగ్రో ఎరువుల దుకాణాలు, పీఏసీఎస్ ఎరువుల దుకాణాన్ని చంద్రశేఖర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన డీలర్లకు పలు సూచనలు చేశారు. దుకాణాలలో స్టాక్ రిజిష్టర్లు విధిగా నమోదు చేయాలని, ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని, పీవోఎస్ మిషన్ ద్వారానే అమ్మకాలు జరపాలని, స్టాక్ బోర్డులపై ధరలను పొందుపర్చాలని సూచించారు. నిబంధనలు అనుసరించి ఎరువుల విక్రయాలు జరపాలని పేర్కొన్నారు. ఏవో మంజుల ఉన్నారు.

పేదింటి ఆడపిల్ల పెళ్లికి ఆర్థిక సాయం

వెల్దండ, ఏప్రిల్ 18 : మండల కేంద్రానికి చెందిన పేదింటి ఆడపిల్ల వరలక్ష్మి పెళ్లికి గురువారం బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యెన్నం శేఖర్‌రెడ్డి పదివేల రూపాయలు ఆర్థికసాయం చేశారు. ఆదేవిదంగా బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు కుర్మిద్ద యాదగిరి 2000వేలు అందజేశారు. నాయకులు రామస్వామి, బాలస్వామి, గెల్వయ్య, పెద్దయ్య, మహేష్, బద్రిలింగం, మహేష్, రాహుల్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు..

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 18 : మండల పరిధిలోని దేవునితిర్మలాపూర్ గ్రామానికి చెందిన వికలాంగుడు గడ్డం నరసింహ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం గడ్డం నరసింహ దశదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ పగిడాల శ్రీనివాసులు పంపిన ఆర్థిక సహాయం ఆ పార్టీ నాయకులు మృతుని కుమారులకు అందజేశారు. ఆ గ్రామ మాజీ ఉప సర్పంచ్ పిల్లి రాములు, సీపీఐ మండల కార్యదర్శి బి.శ్రీనివాసులు, నాయకులు సాలె నారాయణ, గడ్డం బుచ్చయ్య, పరంధాములు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

వంగూరు, ఏప్రిల్ 18: మండల సర్వసభ్య సమావేశం వంగూరులోని మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో విజయభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ భీమమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హాజరవుతున్నారని పేర్కొన్నారు. మండలంలోని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సమావేశానికి సకాలంలో హాజరుకావాలన్నారు.

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

కల్వకుర్తి, ఏప్రిల్ 18 : గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పట్ల పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కల్వకుర్తి ఎంపీడీవో వెంకట్రాములు అన్నారు. ఉపాధి పనులకు వచ్చే కూలీలకు తాగునీటి వసతితోపాటు నీడ సౌకర్యం కల్పించాలని సూచించారు. కల్వకుర్తి పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శుల సమీక్షా సమావేశాన్ని ఎంపీడీవో వెంకట్రాములు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులకు పలు రకాల సూచనలు, సలహాలు అందించారు. గ్రామాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని కోరారు. ఎంపీవో దేవేందర్, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

'కార్మిక చట్టాల పునరుద్ధరణకు బీజేపీని ఓడిద్దాం'

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 18: పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించి రద్దు చేసిన 29 కార్మిక చట్టాలను తిరిగి పునరుద్దీకరించుకుందామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో 138వ మేడే ఉత్సవాల వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి చిన్నపాక శ్రీనివాసులు, సీపీఐ పట్టణ కార్యదర్శి కొత్త రామస్వామి, నాయకులు బాలపీరు, ఆంజనేయులు, భీమయ్య, కవిత, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఉదయం వేళలో ఉపాధి హామీ కూలీలు పనులు ముగించుకోవాలి

అచ్చంపేటటౌన్, ఏప్రిల్ 18: ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున ఉదయం వేళలో ఉపాధి హామీ కూలీలు పనులు ముగించుకోవాలని ఎంపీడీవో బాలచందర్ సృజన్ అన్నారు. గురువారం మండల పరిధిలోని సింగారం, పెద్దతండా పరిధిలో ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించి వారితో మాట్లాడారు. ఈజీఎస్ ఈసీ భాస్కర్, టీఏ మహేష్, సుశీల తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు స్తంభాన్ని ఢీకొన్న కారు తప్పిన ప్రమాదం

మన్ననూర్, ఏప్రిల్ 18: నల్లమల అభయారణ్య ప్రాంతంలోని శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారిపై విద్యుత్తు స్తంభాన్ని కారు ఢీకొన్న ఘటన గురువారం చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళుతున్న కారు మన్ననూరుకు ఏడు కిలోమీటర్ల దూరంలో గల ఘాటు రోడ్డుపై కోతులు అడ్డుగా రావడంతో వాటిని తప్పించే క్రమంలో కారు విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టింది.

విద్యుత్తు స్తంభం నేలకొరిగి కేబుల్ తీగలు తెగిపోవడంతో వటవర్లపల్లి, సార్లపల్లి, కుడిచింతలబైలు గ్రామాలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. కారుకు ఎక్కువగా డ్యామేజ్ జరిగినప్పటికీ అందులో ఉన్న వారందరికీ ఎలాంటి గాయాలు కాలేదు. కారులో ఎయిర్‌బెలూన్లు ఓపెన్ కావడంతో అందరూ సురక్షితంగా బయట పడ్డారు.

ఈ విషయమై అమ్రాబాద్ సీఐ శంకర్ నాయక్‌ను వివరణ కోరగా ఈ ప్రమాదం జరిగిన విషయంపై తమకెవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.